

వరదాయిని.. జగజ్జనని

'వర ప్రదాయిని.. జగజ్జనని' అంటూ భక్తులు శరణు వేడారు. బ్రహ్మంగారిమఠంలోని శ్రీ ఈశ్వరీదేవి ఆరాధన గురుపూజ మహోత్సవాలు కనుల పండువగా నిర్వహిస్తున్నారు. -10లో



తవ్వుకో.. దోచుకో..

తవ్వుకో.. దోచుకో అన్న చందంగా కూటమి నాయకులు మట్టితో అక్రమార్జనకు పాల్పడుతున్నారు. ఇందుకోసం డీకేటీ భూములను ఎంచుకున్నారు. -10లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.140	రూ.200
రెండోరకం	రూ.80	రూ.136

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 146 మెట్రిక్ టన్నులు



పోటెత్తిన అభిమానం



పులివెందుల క్యాంపు కార్యాలయం వద్ద ప్రజలకు అభివాదం చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- పులివెందులలో మాజీ సీఎం వైఎస్ జగన్ ప్రజా దర్బార్‌కు విశేష స్పందన
- ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకూ తగ్గని రద్దీ
- అందర్నీ ఆప్యాయంగా పలకరించిన మాజీ సీఎం వైఎస్ జగన్



ప్రజా దర్బార్‌లో ప్రజల సమస్యలు వింటున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, చిత్రంలో ఎంపీ అవినాష్

సాక్షి ప్రతినిధి, కడప: పులివెందులలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయం జనాలతో కిటకిటలాడింది. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ నిర్వహించిన ప్రజాదర్బార్‌కు విశేష స్పందన లభించింది. స్థానిక జనాలే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు సైతం భారీగా తరలిరావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకూ క్యాంపు కార్యాలయం రద్దీగా ఉండిపోయింది. ఆపన్నహస్తం కోసం కొందరు, అభిమానం చూపేందుకు మరికొందరు, భరోసా కోసం ఇంకొందరు ఇలా... ఎవరికివారు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ క్రమంలో తోపులాట సైతం తెరపైకి వచ్చింది. ఏ ఒక్కర్ని నిరుత్సాహపర్చకుండా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందరితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆప్యాయంగా మాట్లాడారు. అండగా ఉంటానంటూ భరోసా కల్పించారు.

- మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం పులివెందుల క్యాంపు కార్యాలయంలో 10గంటలు పాటు నిల్చునే ఉండిపోయారు. ఉదయం 9గంటలకు ఆయన ప్రజాదర్బార్ చేపట్టారు. అప్పటికే వేచి ఉన్న వందలాది ప్రజానీకానికి గంట గంటకు జనం తోడై వేల మంది క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. ఉదయం మొదలు రాత్రి 8గంటల వరకూ మధ్యలో ఒక గంటపాటు మధ్యాహ్న భోజనం సమయం మినహా పగలంతా ప్రజలతో మాట్లాడడంలోనే నిమగ్నమయ్యారు.

ప్రజల కోసం ప్రత్యక్ష పోరాటాలు చేపట్టాలని పిలుపు...

ప్రజల్ని ప్రభుత్వం వంచింది. పైగా పన్నుల భారం మోపుతోంది. ఆర్థికంగా నడ్డి విరుస్తోంది. ఈ క్రమంలో ప్రజల కోసం ప్రత్యక్ష పోరాటాలు కొనసాగించాలని తరలివచ్చిన కేడర్‌కు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. టీడీపీ దౌర్జన్యాలు భరించలేకున్నామని వాపోయిన కేడర్‌కు 'కష్టాలు ఎల్లకాలం ఉండవు, మంచి రోజులు రానున్నాయి, ఓపిక పట్టండి పార్టీ మీకు అండగా ఉంటుందని' భరోసా ఇచ్చారు. ఇలా కార్యకర్తలు, ప్రజలు, నేతలు, అభిమానులతో మమేకమయ్యారు. టీడీపీ అరాచకాలను పార్టీ శ్రేణులు ధైర్యంగా ఎదుర్కోవాలని ఆయన సూచించారు.

- కాగా ప్రజా సమస్యలను ఆలకించిన వైఎస్ జగన్ స్వయంగా పరిష్కరించగల వాటికి తక్షణమే స్పందించారు. పలు సమస్యల పరిష్కారానికి పక్కనే ఉన్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, డాక్టర్ దాసరి సుధా, ఎమ్మెల్సీలు డీసీ గోవింద రెడ్డి, రమేష్‌యాదవ్, పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి, కడప మేయర్ సురేష్‌బాబు, జిల్లా అధ్యక్షుడు పి రవీంద్రనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఎస్‌బీ అంజద్‌బాషా, గడికోట శ్రీకాంత్‌రెడ్డి, శెట్టిపల్లె రఘురామిరెడ్డి, డాక్టర్ సుధీర్‌రెడ్డి మేకా ప్రతాప్ అప్పారావు, చెవిరెడ్డి భాస్కరరెడ్డి, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి, శింగనమల సాంబశివారెడ్డి, రెడ్యం వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.





అభిమాన సంద్రం... ప్రజలు, పార్టీ శ్రేణులతో కిటకిటలాడిన క్యాంపు కార్యాలయం .... వినతిపత్రాలు స్వీకరిస్తున్న జననేత వైఎస్ జగన్

అదిరిపోయిన ఆర్ట్



మీతో రక్తం పంచుకుని పుట్టకపోయినా...నీ కోసం రక్తం పంచిన బంధం మాది'అన్న క్యాప్షన్‌తో అభిమాని అజయ్‌రెడ్డి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫోటో ఫ్రేమ్ చూపెట్టి ఆటోగ్రాఫ్ కోరారు. చిరునవ్వుతో ఆటోగ్రాఫ్ ఇచ్చిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసిన అజయ్‌రెడ్డి ముగ్ధుడయ్యాడు.



వైఎస్ జగన్‌కు 'బాసర' సరస్వతీ మాత చిత్రపటం బహూకరణ



మహిళ ఆవేదన వింటున్న వైఎస్ జగన్

ఎల్లో మీడియా దుష్ప్రచారం

రద్దీ ఎక్కువై అభిమాన నాయకుడిని త్వరగా కలుసుకోవాలనే ఆరాటంతో కార్యకర్తలు మధ్య ఓ దశలో తోపులాట తెరపైకి వచ్చింది. అంతే.. 'అదిగోపులి అంటే ఇదిగో తోక'అంటూ ఎల్లో మీడియా దుష్ప్రచారాన్ని అందుకుంది. కార్యాలయంపై రాళ్ల దాడి అంటూ వండి వార్చడంలో నిమగ్నమైంది. ఈ విషయాన్ని తెలుసుకున్న అభిమానులు ఎల్లోమీడియాపై విరుచకపడ్డారు. ఇలాంటి దుష్ప్రచారాన్ని ఇకనైనా మానాలంటూ హితవు పలికారు.

నేడు వివాహానికి హాజరుకానున్న వైఎస్ జగన్

పులివెందుల రూరల్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగు రోజుల పర్యటనలో భాగంగా నాల్గవ రోజు శుక్రవారం పులివెందుల పట్టణంలోని స్థానిక విజయ్ గార్డెన్‌లో జరిగే ఓ వివాహ కార్యక్రమానికి హాజరు కానున్నారు. వైఎస్ జగన్‌తోపాటు ఆయన సతీమణి వైఎస్ భారతిరెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించనున్నారు. అనంతరం అక్కడ నుంచి తాడేపల్లెకు బయలుదేరి వెళ్లనున్నారు.

న్యూస్‌రీల్

హార్సిలీహిల్స్‌పై ఎస్పీ

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌కు జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు గురువారం విచ్చేశారు. ఉదయం వచ్చిన ఆయన కొంతసేపు పోలీసు అతిథి గృహం విడిదిచేసి మధ్యాహ్నం వెనుదిరిగి వెళ్లారు.

వైవీయూ పీజీ పరీక్షల షెడ్యూలులో మార్పు

వైవీయూ: యోగివేమన యూనివర్సిటీ, అనుబంధ పీజీ కళాశాలల ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ, ఎంపీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు 2025 సంవత్సరం జనవరి 21వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి తెలిపారు. డిసెంబరు నెల 30వ తేదీ నుంచి జరగాల్సి ఉన్నా విద్యార్థుల ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని మార్పు చేశామన్నారు. జనవరి 21, 23, 25, 27, 29, 31 తేదీలలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్షలు ఉంటాయని వెల్లడించారు.

నేడు ఉద్యోగమేళా

రాయచోటి (జగదాంబసెంటర్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన జిల్లాలోని పీలేరు, రైల్వేకోడూరులలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి దాసరి నాగార్జున గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పీలేరు పట్టణంలోని ఎస్‌జీ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో, రైల్వేకోడూరు గ్లోబల్ సర్వీస్ ట్రస్ట్‌లో ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్బీఐ లైఫ్, ఐసీఐసీఐ బ్యాంకు, ఏయు స్మాల్ ఫినాన్స్ బ్యాంకు, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ తదితర కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. మరిన్ని వివరాలకు పీలేరు-9966086996, రైల్వేకోడూరు-9550095775 నంబర్లలో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

5న జిల్లా స్థాయి ఎంపికలు

కడప స్పోర్ట్స్: ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లాస్థాయి మాస్టర్స్ బ్యాడ్మింటన్ ఎంపికలు జనవరి 5వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ సింగం భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి తెలిపారు. కడప నగరంలోని వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంలో 35 ఏళ్ల పైబడిన క్రీడాకారులు మొదలు ప్రతి 5 సంవత్సరాలకు ఒక విభాగం చొప్పున 65 సంవత్సరాలు పైబడిన క్రీడాకారులకు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పురుషులు, మహిళల విభాగాల్లో సింగిల్స్, డబుల్స్ వేర్వేరుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు తాను అర్హత కలిగిన విభాగాల్లో ఒక సింగిల్, ఒక డబుల్, ఒక మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో పాల్గొనేందుకు అర్హులని టోర్నీ రెఫరీ ఎస్. జిలానీబాషా తెలిపారు.వివరాలకు 9440107080, 9866028100 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ప్రతి రైతు ఇ-క్రాప్ చేయించుకోవాలి



రైతులతో మాట్లాడుతున్న జేడీఏ చంద్రానాయక్

చిన్నమండెం: ప్రతి రైతు తప్పనిసరిగా ఇ-క్రాప్ నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి చంద్రానాయక్ అన్నారు. గురువారం చిన్నమండెం మండలం దిగువగొట్టివీడు రైతు సేవా కేంద్రం పరిధిలో రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలను రైతులు ఇ-క్రాప్ నమోదు చేసుకోవాలని, ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. వరి, మామిడి, టమోటాలకు ఇన్సూరెన్స్ చేయించుకుంటే ఒక ఎకరాకు వరికి రూ.126, టమాటాకు రూ.1600, మామిడికి రూ.2250 వస్తుందన్నారు. ఈ నెల 31వ తేదీలోగా రైతులు ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ రాజేష్, రైతులు పాల్గొన్నారు.

ఆర్‌బీఎస్‌కే స్క్రీనింగ్ పరీక్షల పరిశీలన

సిద్దవటం: మండలంలోని శాఖరాజుపల్లె పంచాయతీ మోదీన్‌సాబ్‌పల్లె ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు జరుగుతున్న రాష్ట్రీయ బాలల సురక్షా స్క్రీనింగ్ (ఆర్‌బీఎస్‌కే) పరీక్షల కార్యక్రమాన్ని జిల్లా వైద్యాధికారి నాగరాజు పరిశీలించారు. గురువారం ఇక్కడ ఆయన మాట్లాడుతూ 1 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలు ప్రతి ఒక్కరికీ ముందస్తు పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. ఏవైనా జన్యులోపాలు, శరీర భాగాలకు సంబంధించిన వ్యాధులు ఉంటే ఆరోగ్య కార్యకర్తలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు ఆశావర్కర్ల సాయంతో వారిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లేదా సర్వజన ఆసుపత్రులకు పంపించి వారి వివరాలను సంబంధిత యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఇందుకోసం రిమ్స్‌లోని జిల్లా అత్యవసర సమాచార కేంద్రంలో ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేశామని, అక్కడ వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారన్నారు. నిర్దేశించిన వ్యవధిలో రోజుకు 30 మంది చొప్పున పిల్లలకు స్క్రీనింగ్ పరీక్షలు చేయాలని సూచించామని ఆయన తెలిపారు.



మోదీన్‌సాబ్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో పిల్లల స్క్రీనింగ్ పరీక్షలను పరిశీలిస్తున్న వైద్యాధికారి నాగరాజు

సామాన్యుడికి సర్దుపోటు!

ప్రజలను మోసం చేయడమే



నా పేరు ముద్దలూరు సుబ్బరామరాజు, మాది కేఆర్ కండ్రిక, రైల్వేకోడూరు. వ్యవసాయం చేసి జీవనం సాగిస్తున్నా. ఎన్నికలకు ముందు చంద్రబాబు కూటమి ప్రభుత్వం వస్తే విద్యుత్ భారం లేకుండా చేస్తామని చెప్పి కొద్ది కాలంలోనే 3 దఫాలు విద్యుత్ చార్జీలు పెంచడం ప్రజలను నమ్మించి మోసం చేయడమే. విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో భారం మోపడం సరికాదు.

- ప్రజలకు 'షాక్' ఇస్తోన్న కూటమి సర్కారు
- జిల్లా ప్రజలపై సుమారు రూ. 8–10 కోట్ల నెలవారి బారం
- విద్యుత్‌చార్జీల పెంపుపై నేడు వైఎస్సార్ సీపీ పోరుబాట



సాక్షి రాయచోటి: ఇక నుంచి చలికాలమైనా..ఎండాకాలమైనా..వినియోగదారులకు కరెంటు సెగ మాత్రం తప్పదు. ఎందుకంటే ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో కూటమి సర్కార్ వినియోగదారులపై పిడుగు వేసింది. ప్రతిసారి ఎన్నికలకు ముందు అది చేస్తాం..ఇది చేస్తామంటూ ఊదరగొట్టే బాబు ఈసారి సార్వత్రిక ఎన్నికలకు ముందు కూడా కరెంటుచార్జీలు పెంచబోమంటూ పదేపదే ప్రజల ముందు హామీలు గుప్పించారు. అధికారంలోకి రాగానే ఐదేళ్లు ఎవరేమి చేయలేనట్లు యథావిధిగా ఏడు నెలల పాలనలోనే కరెంటుచార్జీల పెంపునకు చంద్రబాబు సర్కార్ తెర తీసింది. ధనికుడైనా, సామాన్యుడైనా వాడిన కరెంటుకు బిల్లు మాత్రం అప్పటికీ ఇప్పటికీ తేడా ఈ నెలలోనే కనిపించనుంది. జిల్లా ప్రజలపై కరెంటు బిల్లులు పెనుభారంగా మారనున్నాయి.

ఎన్నికలకు ముందు ఒకటి... అధికారం వచ్చాక మరొకటి

చంద్రబాబు ప్రభుత్వం ఎప్పుడు చూసినా ఎన్నికలకు ముందు ఒకమాట చెప్పడం, అధికారంలోకి వచ్చాక మరొకటి చెప్పడం అలవాటుగా మారింది. మొన్నటికి మొన్న అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పేరుతో సుపరిపాలన అందిస్తామని గొప్పలు చెప్పి తీరా ఇప్పుడు రాష్ట్రం ఆర్థిక పరిస్థితి బాగాలేదంటూ అమలు చేయకుండా కుంటి సాకులు చెబుతున్నారు. ఇలా ప్రతి హామిలోనూ ఏదో ఒక సాకుతో ప్రజలకు ఇచ్చిన మాటను సర్కార్ మాయ చేస్తోంది. అలాగే విద్యుత్ ఛార్జీల విషయంలోనూ పెంచబోమని హామి ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఛార్జీలతోపాటు సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజలపై మోయలేని భారాన్ని మోపుతోంది.

ప్రజలపై అదనపుభారం



జిల్లాలో విద్యుత్ వినియోగదారులకు సంబంధించి గృహ, వ్యాపార, వాణిజ్య, వ్యవసాయ, విద్యా సంస్థలు, ఆలయాలు, మసీదు, చర్చిలు, వీధి దీపాలు ఇలా అన్ని రకాల వినియోగదారులకు వడ్డన మొదలైంది. ఏపీఎస్ పీడీసీఎల్ ఇప్పటికే ఒకసారిచార్జీలు పెంచగా, ఈనెలలో సర్దుబాటు పేరుతో ఒక్కో యూనిట్‌కు ఒక్కసారి 60 పైసలు, మరోసారి 61 పైసలు కలుపుకుని రూ.1.21 పైసలు వసూలు చేస్తోంది. ఏప్రిల్ నెలలో వాడిన విద్యుత్ యూనిట్లకు సంబంధించి సర్దుబాటు ఛార్జీల పేరుతో భారాన్ని ప్రజలపై మోపనున్నారు. దీంతో పెద్ద ఎత్తున బిల్లుల మోత మోగనుంది. జిల్లాలోని అన్ని రకాల విద్యుత్ కనెక్షన్లకు సంబంధించి 7,14,532 కనెక్షన్లు ఉండగా, అందులో గృహాలకు సంబంధించి 5,09,417 ఉన్నాయి. ఈనెల నుంచి ప్రజలపై భారం పడనుండగా విద్యుత్‌శాఖకు సుమారు రూ. 8–10 కోట్ల మేర అదనపు మొత్తాలు పెరగనున్నాయి.

నేడు వైఎస్సార్ సీపీ విద్యుత్ పోరు



అధికారంలోకి వచ్చి సరిగ్గా ఏడు నెలలు కాకముందే ప్రజల నడ్డి విరుస్తూ సామాన్యులపై భారం మోపతున్న కూటమి సర్కార్ తీరును నిరసిస్తూ వైఎస్సార్ సీపీ ఉద్యమబాట పడుతోంది. చంద్రబాబు సర్కార్ ఇప్పటికే రైతులను విస్మరించిన నేపథ్యంలో ఈనెల 11న జిల్లా కలెక్టరేట్ ఎదుట వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ఇప్పుడు మరోమారు ప్రజల పక్షాన పోరాటం చేసేందుకు వైఎస్సార్ సీపీ సన్నద్ధమైంది. ఇందులో భాగంగా పెంచిన విద్యుత్ ఛార్జిలను తగ్గించాలని, సామాన్యులపై భారం పడకుండా చర్య లు తీసుకోవాలని...విద్యుత్ ఛార్జీలు, సర్ ఛార్జిల పేరుతో అదనపు బారం మోపుతున్న సర్కార్ తీరుకు వ్యతిరేకంగా శుక్రవారం పెద్ద ఎత్తున జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు, ధర్నాలు, వినతిపత్రాలను సమర్పించనున్నారు. రాజంపేటలో జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, తంబళ్లపల్లెలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి, రైల్వేకోడూరులో మాజీ ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, రాయచోటిలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, పీలేరులో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మదనపల్లె మాజీ ఎమ్మెల్యే దేశాయి తిప్పారెడ్డి, ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు కొనసాగనున్నాయి. అంతేకాకుండా ఇప్పటికే ఎక్కడికక్కడ పెద్ద ఎత్తున వైఎస్సార్ సీపీ శ్రేణులతోపాటు అన్ని వర్గాలు కదిలివచ్చేలా పార్టీ నేతలు పిలుపునిచ్చారు.

కరెంటు చార్జీల పెంపు దారుణం



ఎన్నికల ముందు కరెంటు చార్జీలు పెంచమని చెప్పి.. ఇప్పుడు ప్రజల నడ్డి విరిగేలా చార్జీలు పెంచడం దారుణం. గతంలో వాడిన విద్యుత్‌కు ఇప్పుడు సర్దుబాటు పేరుతో ప్రజలకు ప్రభుత్వం షాక్ ఇచ్చినట్లే. పేద, మధ్య తరగతి వారికి మోయలేని భారం. పెంచిన చార్జీలను వెంటనే తగ్గించి ఉపశమనం కలిగించాలి. డిసెంబరు నెలలో వచ్చిన బిల్లులో 10 నుంచి 20 శాతంపైగా చార్జీలు పెరిగాయి.

–ఎస్. కృష్ణవేణమ్మ, అంగళ్లు, కురబలకోట మండలం

మోయలేని భారం



కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచి మాలాంటి పేదలపై పెనుభారం మోపుతోంది. అక్టోబర్ నెలలో రూ. 230, నవంబర్ నెలలో రూ. 445లు విద్యుత్ బిల్లు వచ్చింది. మా ఇంట్లో ఒకలైటు, ఒక ఫ్యాన్, ఒక టీవీ మాత్రమే ఉన్నాయి. తక్కువ విద్యుత్ వాడినా మాపై భారం మోపడం సరికాదు.

–పొదిలి దేవి, నందలూరు

విద్యుత్ చార్జీలు తగ్గించాలి



నేను డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. నాలుగు నెలల నుండి విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయి. దీంతో బిల్లు కట్టాలంటే ఇబ్బందిగా ఉంది. గత ప్రభుత్వంలో విద్యుత్ చార్జీలు ఇలా పెంచలేదు. కరెంటు తక్కువ వాడుతున్నా విద్యుత్ చార్జీలు మాత్రం అధికంగా వస్తున్నాయి. చంద్రబాబు నాయుడు చెప్పిన హామీలను ఒకటి కూడా అమలు చేయలేదు. వెంటనే విద్యుత్ చార్జీలను తగ్గించాలి.

–గల్లా వెంకటేష్, గుల్లావాండ్లపల్లి

ప్రజల నడ్డి విరుస్తున్నారు



బాబు అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ చార్జీలను పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నారు. గతనెల నాకు రూ. 140, ఈనెలలో రూ. 182 బిల్లు వచ్చింది. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదే ఇలా విద్యుత్ చార్జీలు పెంచితే.. మిగిలిన నాలుగేళ్ల పరిస్థితి ఎలా ఉంటుందోనని భయమేస్తోంది.

–షేక్ అహ్మద్ బాషా, వంతాటిపల్లె, సిద్దవటం మండలం

చేనేత కుటుంబాలు కుదేలు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేనేత కుటుంబాలకు 200 యూనిట్లు ఉచితమన్నారు. అయితే అది అమలవుతున్న పరిస్థితి ఎక్కడా లేదు. పవర్ లూమ్స్ యజమానుల నుంచి సర్‌ఛార్జీల పేరుతో ఒకొక్కరి నుంచి రూ.60–70 వేలు కట్టించుకుంటున్నారు. 8 హెచ్‌పీ నుంచి 10 హెచ్‌పీకి అదనంగా కట్టాలని ఒత్తిడి తెస్తున్నారు. పెంచిన చార్జీలతో చేనేత కార్మికుల నడ్డి విరగ్గొడుతున్నారు.

– శీలం రమేష్, చేనేత సంఘం నాయకులు, నీరుగట్టువారిపల్లె

క్లుప్తంగా

ఇద్దరిపై దాడి

కురబలకోట : రాత్రి వేళ ఇంటి పక్కన ఉన్నారన్న అనుమానంపై ఇద్దరిపై ఓ కుటుంబ సభ్యులు విచక్షణా రహితంగా కొడవలి, రాడ్లతో దాడి చేశారు. ముదివేడు పోలీసుల కథనం మేరకు.. మదనపల్లె అమ్మచెరువు మిట్ట కాలనీలో రాజు అనే వ్యక్తి నివసిస్తున్నాడు. ఇతని ఇంటికి సమీపంలోని ఏపీ గోడౌన్ వద్ద పని చేసే శ్రీనివాసులు (30), అతని బావమరిది బసినికొండకు చెందిన గుణ శేఖర్ (21)తోపాటు కొందరు.. రాజు ఇంటి సమీపంలో రాత్రి వేళ మాట్లాడుకోసాగారు. అనుమానించిన రాజు అతని కుటుంబ సభ్యులు వారిపై కొడవలి, రాడ్లతో దాడి చేశారు. బాధితులను మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అరటి, టెంకాయ చెట్ల నరికివేత




నరికివేతకు గురైన టెంకాయ, అరటి చెట్లు

చిన్నమండెం : మండలంలోని కొత్తపల్లె గ్రామానికి చెందిన రవీంద్రారెడ్డి తోటలో టెంకాయ, అరటి చెట్లను బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారు. రవీంద్రారెడ్డికి 2 ఎకరాల పొలం ఉంది. అందులో టెంకాయ, అరటి చెట్లను పెంచుతున్నాడు. మూడు టెంకాయ, మూడు అరటి చెట్లను నరికివేశారని బాధితుడు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

ఆటో, బైక్ ఢీకొని యువకుడి మృతి



మృతి చెందిన పవన్‌కుమార్

గాలివీడు : మండలంలోని గాలివీడు కొనంపేట ప్రధాన రహదారిపై ఆటో, బైక్ ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందాడు. లక్కిరెడ్డిపల్లి మండలం పందెళ్లపల్లి గ్రామం దళితవాడకు చెందిన కోట్లపల్లి వెంకటరమణ, నారాయణమ్మ దంపతుల కుమారుడు పవన్‌కుమార్(18) గాలివీడు పంచాయతీ దళితవాడలోని తన సోదరి ఇంటికి వచ్చాడు. తిరుగు ప్రయణంలో బైక్‌పై వెళ్తుండగా.. నూలివీడు బక్కిరెడ్డిగారిపల్లె సమీపంలో లక్కిరెడ్డిపల్లి నుంచి గాలివీడుకు వస్తున్న ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో పవన్‌కుమార్ తలకు బలమైన గాయమై కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాడు. అదే మార్గంలో వెళ్తున్న డీఎస్పీ కృష్ణమోహన్, సీఐ కొండారెడ్డి, ఎస్‌ఐ రామకృష్ణ బాధితుడిని తమ వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

పెట్రోలు బంకు సిబ్బందిపై దాడి

అట్లూరు : పెట్రోలు బంకు సిబ్బందిపై దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. అట్లూరు క్రాస్ రోడ్డుకు చెందిన దేవర బాలకృష్ణతోపాటు మరో ముగ్గురు రెడ్డిపల్లి దగ్గర ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌కు వెళ్లి బాటిళ్లకు పెట్రోలు అప్పుగా పట్టాలన్నారు. బంకులో పని చేసే సిబ్బంది అప్పుగా పట్టేది లేదనడంతో ఆగ్రహించి దాడి చేశారు. దీంతో పెట్రోలు బంకులో పని చేస్తున్న గంపా రత్నమయ్య బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు విచారణ చేసి దేవర బాలకృష్ణతోపాటు మరో ముగ్గురిపై గురువారం కేసు నమోదు చేశారు.

తవ్వుకో.. దోచుకో..



డీకేటీ భూమిలో మట్టిని తవ్వుతున్న జేసీబీ



ఏర్పడిన పెద్ద గుంత

- పేట్రేగుతున్న కూటమి నాయకుల అక్రమాలు
- డీకేటీ భూముల మట్టి తరలింపు
- పట్టించుకోని అధికారులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : 'తవ్వుకో.. దోచుకో' అన్న చందంగా కూటమి నాయకులు మట్టితో అక్రమార్జనకు పాల్పడుతున్నారు. ఇందుకోసం డీకేటీ భూములను ఎంచుకున్నారు. యథేచ్ఛగా తవ్వకాలు చేపడుతూ.. మట్టిని ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కట్టడి చేయాల్సిన అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంతో.. పగలు, రాత్రి అనే తేడా లేకుండా తరలించేస్తున్నారు. ఎర్రగుంట్ల మండల పరిధిలోని మాలెపాడు ఫ్యాక్షన్ గ్రామంగా పోలీస్ రికార్డుల్లో ఉంది. ఈ గ్రామంలో ఇప్పటికీ పికెటింగ్ కొనసాగుతోంది. ఎలాంటి చిన్నపాటి సంఘటనలు కూడా జరగకుండా ఉండేందు పోలీసుల నిఘా ఉంది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాడిన తర్వాత.. ఇక్కడ దందా సాగుతోంది. కూటమి నాయకులు దీన్ని ఆదాయ వనరుగా ఎంచుకున్నారు.

అనుమతులు లేకున్నా..

ఎలాంటి అనుమతులు లేకున్నా.. డీకేటీ భూముల్లో జేసీబీల ద్వారా మట్టిని తవ్వేస్తున్నారు. టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. ప్రధాన పట్టణమైన ప్రొద్దుటూరుకు అధికంగా తీసుకున్నారు. ఒక్కొక్క టిప్పర్ మట్టిని రూ.3 వేలకు అమ్ముకుంటున్నారు. రెవెన్యూ, పోలీస్, మైనింగ్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవున్నాయి. ప్రజలు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఒక శాఖ అధికారులు మరో శాఖ వారిపై నెపం నెట్టివేస్తూ తప్పించుకుంటున్నారు. సమన్వయంతో పని చేసి కట్టడి చేయాల్సి ఉండగా.. చోద్యం చూడటం గమనార్హం. దీంతో డీకేటీ భూముల్లో పెద్ద గుంతులు పడుతున్నాయి. భారీ వాహనాలు నిరంతరం వెళ్లడం ద్వారా రోడ్లు దెబ్బతింటున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టి దందాను నియంత్రించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్, ఎస్పీలు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విధులకు ఆటంకం కలిగిస్తే చర్యలు

- ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు
- మద్యం మత్తులో ఘర్షణకు దిగిన 50 మందిపై కేసు నమోదు



మదనపల్లె : పట్టణ ప్రశాంతతకు భగ్నం కలిగించేలా వ్యవహరించి, పోలీసు విధులకు ఆటంకం కలిగించిన ఎవ్వరినీ వదిలి పెట్టే ప్రసక్తే లేదని జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు అన్నారు. గురువారం మదనపల్లె డీఎస్పీ కార్యాలయానికి వచ్చిన ఆయన స్థానిక మీడియాతో మాట్లాడారు. పట్టణంలో బుధవారం రాత్రి జరిగిన ఘటన... ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనాలతో రోడ్డుపై వెళుతున్నప్పుడు జరిగిన గొడవ అన్నారు. ఓ యువకుడు తన తల్లిని తీసుకుని ద్విచక్రవాహనంలో వస్తుండగా, ముందు ద్విచక్రవాహనంలో వెళుతున్న మరో యువకుడు సడెన్‌గా బ్రేక్ వేయడంతో, వెనుక వస్తున్న యువకుడు వాహనాన్ని కంట్రోల్ చేసే క్రమంలో వాగ్వివాదం జరిగిందన్నారు. ఇద్దరి మధ్య జరిగిన ట్రాఫిక్ సమస్య ఘటనను తీసుకుని కలహాలు రెచ్చగొట్టేలా కొందరు వ్యక్తులు ప్రవర్తించారన్నారు. బాధితుడు బహిరంగంగా పోలీసులు తనకు న్యాయం చేశారని చెప్పినా.. నిందితుడితో బాధితుడికి క్షమాపణ చెప్పించినప్పటికీ కొందరు ఉద్దేశపూర్వకంగా వివాదాన్ని పెద్దది చేసేందుకు ప్రయత్నించారన్నారు. బాధితుడు సామాజిక మాధ్యమాల్లోనూ తనకు న్యాయం జరిగిందని పోస్ట్ పెట్టాడని, అతడు సంతృప్తిగా ఉన్నప్పటికీ, ఘటనను సాకుగా తీసుకుని, పట్టణ ప్రశాంత వాతావరణాన్ని భగ్నం చేసేందుకు కొందరు ప్రయత్నించారన్నారు. ఘటనతో ఎలాంటి సంబధం లేని కొందరు ఆకతాయిలు మద్యం మత్తులో అకారణంగా ఓ ప్రైవేట్ ఆస్తిని ధ్వంసం చేయడమే కాకుండా ఉద్రిక్త వాతావరణానికి కారకులయ్యారన్నారు. ఘటన జరిగిన సమయంలో సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా ఘర్షణకు కారకులను గుర్తిస్తున్నామని, ఇప్పటి వరకు 50 మందిని గుర్తించామని, మిగిలిన వారందరినీ గుర్తించి కేసులు నమోదు చేస్తామన్నారు. అకారణంగా గొడవలు చేస్తే దాని పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ కొండయ్యానాయుడు, సీఐలు రామచంద్ర, సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

పెద్దతిప్పసముద్రం : ప్రేమ పేరుతో వంచించి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మైనర్ బాలికను మోసం చేసిన కేసులో ఓ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసామని ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు. బాలిక పోలీసులకు చేసిన ఫిర్యాదు, ఎస్‌ఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పట్టెంవాండ్లపల్లి పంచాయతీ బాగేపల్లికి చెందిన ఓ మైనర్ బాలిక సమీపంలోని కందుకూరులో పదో తరగతి చదువుతోంది. కందుకూరు గ్రామానికి చెందిన గుర్రాల నరసింహులు(23) అనే యువకుడు మైనర్ బాలికను ప్రేమ పేరుతో వంచించాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 19న బాలికకు మాయమాటలు చెప్పి అపహరించుకెళ్లాడు. బాలికను బెంగళూరు, చెన్నై లాంటి నగరాల్లో షికార్లు చేయించి శారీరకంగా వంచించాడు. ఈ తరుణంలో మైనర్ బాలిక తల్లి సుజాత పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుతో అప్రమత్తమయ్యాడు. దీంతో సదరు యువకుడు భయపడి బాలికను ఊర్లో వదిలి పరారయ్యాడు. అనంతరం జరిగిన ఘటనపై బాలిక పోలీసుల ఎదుట వెల్లడించింది. బాలికకు వైద్య పరీక్షలు నిర్వహించి కన్నవాళ్లకు అప్పగించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు యువకుడిపై ఎస్సీ, ఎస్టీతోపాటు పోక్సో కేసు నమోదు చేసామని ఎస్‌ఐ వెల్లడించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



ఘాట్ రక్షణ గోడను ఢీకొన్న లారీ

రామాపురం : కర్నూలు – చిత్తూరు 40వ జాతీయ రహదారి మండల పరిధిలోని గువ్వల చెరువు ఘాట్‌పై గురువారం ప్రమాదం త్రుటిలో తప్పింది. ఘాట్ రెండవ మలుపు వద్ద సిమెంటు లారీ అదుపుతప్పి రక్షణ గోడను ఢీకొట్టింది. రక్షణ గోడపైకెక్కి లారీ ఆగిపోయింది. దీంతో ప్రమాదం నుంచి డ్రైవర్, క్లీనర్ బయటపడ్డారు. రక్షణ గోడ లేనిపక్షంలో లారీ 50 అడుగుల లోయలో పడిపోయేది. తుపాను కారణంగా చిరుజల్లులు కురుస్తుండడంతో రోడ్డుపై తేమ ఉండడం.. టైర్లు రోడ్డు గ్రిప్పు కోల్పోవడం వల్ల మలుపులో ఘాటు దిగుతూ ఉండడం ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది. కావున ఘాటుపై ప్రయాణించే వాహనదారులు నెమ్మదిగా వెళ్లి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

మాకు న్యాయం చేయండి



కలెక్టరేట్ ఎదుట బాధితుల నిరసన

రాయచోటి అర్బన్ : తమకు న్యాయం చేయాలని జిల్లాలోని బి.కొత్తకోట మండలం గోళ్ళపల్లె రెవెన్యూ గ్రామం దళితవాడకు చెందిన పోతగాళ్ళ వీరప్ప, రమణప్ప, వెంకటరమణ, వేమన్న తదితరులు జిల్లా ఉన్నతాధికారులకు విన్నవించారు. గురువారం బాధితులు తమ కుటుంబీకులతో కలిసి సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు నేతృత్వంలో నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బి.కొత్తకోట మండలం గోళ్ళపల్లె రెవెన్యూ గ్రామం సర్వే నంబర్ 427లో 2.27 ఎకరాల భూమిని సాగు చేసుకుంటూ జీవిస్తున్నామన్నారు. ప్రభుత్వం రీసర్వే అనంతరం ఎల్‌పీ నంబర్లతో సహా పట్టాదారు పాసు బుక్కులను మంజూరు చేసిందని తెలిపారు. కాగా గ్రామానికే చెందిన పెద్దకోనప్ప, వెంకటరమణ, చిన్నకోనప్ప, అలివేలమ్మతోపాటు మరో 12 మంది భూమి తమదంటూ మాపై దౌర్జన్యానికి దిగుతూ ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. రెవెన్యూ అధికారుల సహాయ, సహకారాలతో తప్పుడు ధ్రువీకరణ పత్రాలను పొందారన్నారు. ఈ విషయంపై కొత్తకోట తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి ఫలితం లేదన్నారు. మదనపల్లె జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నుంచి టెంపరరీ ఇంజక్షన్ ఆర్డర్‌ను పొందామన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి పూర్తి స్థాయిలో విచారణ చేయించాలని కోరారు. అనంతరం డీఆర్‌ఓ మధుసూదన్‌కు వినతిపత్రం అందజేశారు.

పశువుల అక్రమ రవాణా

- ఆరుగురి అరెస్ట్
- పరారీలో ప్రధాన నిందితుడు



పట్టుకున్న పశువులను పరిశీలిస్తున్న సీఐ జీవన్

బి.కొత్తకోట : తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లా పెబ్బేరు నుంచి తమిళనాడుకు అక్రమంగా పశువులను తరలిస్తున్న కేసులో ఆరుగురిని అరెస్ట్ చేయగా ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. నిందితులంతా చిత్తూరు జిల్లాకు చెందిన వారే. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను సీఐ జీవన్ గంగనాథ్‌బాబు తెలిపారు. గురువారం అనంతపురం జిల్లా నుంచి బి.కొత్తకోట మండలం మీదుగా రెండు లారీల్లో ఆవులను తమిళనాడుకు అక్రమంగా తరలిస్తున్నారని బి.కొత్తకోట బీసీ కాలనీకి చెందిన కె.రవీంద్ర.. బయ్యప్పగారిపల్లె వీఆర్‌ఓ రవికుమార్ దృష్టికి తీసుకొచ్చాడు. వీఆర్‌ఓ ఈ విషయాన్ని తహసీల్దార్‌కు తెలపగా ఆయన పోలీసుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. వీఆర్‌ఓ సీఐకు చెప్పగా స్పందించి జాతీయ రహదారిపై పెద్దపల్లి క్రాస్ వద్దకు పోలీసులను పంపారు. అదే సమయంలో రెండు లారీలు రాగా.. పోలీసులు, గ్రామస్తులు తనిఖీ చేశారు. లారీల్లో 66 పశువులు ఉన్నట్టు గుర్తించారు. వీటిని తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లా పెబ్బేరు మండలంలో పలుచోట్ల సంతల్లో కొనుగోలు చేసి తమిళనాడులోని సేలంలో జంతువధశాలలకు తరలిస్తున్నట్టు నిర్ధారించారు. అనుమతి, లైసెన్సు లేకుండా కబేళాలకు అక్రమంగా తరలిస్తున్నట్టు గుర్తించడంతో దీనిపై చర్యలు తీసుకోవాలని వీఆర్‌ఓ రవికుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు చిత్తూరు జిల్లా పుంగనూరుకు చెందిన ఎస్.మహ్మద్ ఆరీఫ్, పెద్దపంజాణీ మండలం రాయలపేటకు చెందిన షేక్ అబ్దుల్ మునాఫ్(62), జి.సుబ్రమణ్యం(53), ఎస్.ముబారక్(39), కె.కృష్ణప్ప(60), కె.మాబుబాషా(53), పలమనేరు పట్టణానికి చెందిన ఎస్.అక్బర్(60)లపై కేసు నమోదు చేశారు. వీరిలో ఆరుగురిని అరెస్ట్ చేయగా ఎస్.మహ్మద్ ఆరీఫ్ పరారీలో ఉన్నట్టు సీఐ తెలిపారు. స్వాధీనం చేసుకున్న పశువులను తంబళ్లపల్లెలోని నవశక్తి గోశాలకు తరలించారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కృష్ణమోహన్

గాలివీడు : మండలంలోని బోరెడ్డిగారిపల్లి వద్ద రెండు రోజుల క్రితం కళాకారుడు సత్యన్న అలియాస్ వెంకటరమణ హత్య కేసులో నిందితులను అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రాయచోటి డీఎస్పీ ఎంఆర్ కృష్ణమోహన్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిందితులను హాజరు పరిచి, వివరాలు వెల్లడించారు. బోరెడ్డిగారిపల్లి గ్రామ కస్పాలో పెద్ద ఖర్మ సందర్భంగా కీచకవధ వీధి నటకం ప్రదర్శించారు. ఆ సందర్భంలో వెంకటరమణారెడ్డి కీచకుని పాత్ర పోషించగా, తలారి పాత్రలో సత్యన్న అలియాస్ వెంకటరమణ నటించారు. నాటకం ప్రదర్శిస్తుండగా ఇరువురి మధ్య మనస్పర్థల కారణంగా గొడవ మొదలైంది. గ్రామంలో ఉన్న పెద్దలు జోక్యం చేసుకుని సర్దిచెప్పారు. అయినా వారి మధ్య వాగ్వాదం పెరిగి, నాటకం మాధ్యలోనే ఆపివేశారు. ఈ క్రమంలో సత్యన్న, రమణారెడ్డి తిరుగు ప్రయాణమై బోరెడ్డిగారిపల్లి బస్‌స్టాప్ వద్దకు రాగానే.. కోపం పెంచుకున్న వెంకటరమణారెడ్డి సత్యన్న తలపై బండరాయితో బలంగా కొట్టాడు. దీంతో సత్యన్న అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే వెంకటరమణారెడ్డి తన కుమారులకు ఫోన్ చేసి సంఘటన స్థలానికి పిలిపించుకున్నారు. తమ సొంత ఆటోలో సత్యన్న మృతదేహాన్ని వేసుకుని సమీపంలోని మంగళపల్లి గుట్ట వద్ద పడేశారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. నిందితులు వెంకటరమణారెడ్డి, ఆయన కుమారులు శివశంకర్ రెడ్డి, రామాంజులురెడ్డిని పోలీసులు గరుగుపల్లి క్రాస్ వద్ద అరెస్ట్ చేశారు. ఈ కేసును ఛేదించిన లక్కిరెడ్డిపల్లి సీఐ కొండారెడ్డి, ఎస్‌ఐ రామకృష్ణ, పోలీస్ సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

నాణ్యమైన విద్యుత్ అందించాలి



విద్యుత్ సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్‌ఈ రమణ

గుర్రంకొండ : వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని ట్రాన్స్‌కో ఎస్‌ఈ రమణ అన్నారు. గురువారం గుర్రంకొండ 33/11 కేవీ సబ్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఫ్యూజ్‌ఆఫ్ కాల్ సెంటర్, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ సరఫరా లైన్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. విద్యుత్ ప్రమాదాలను నివారించాలన్నారు. కేబుళ్లలో విద్యుత్ ప్రవాహాన్ని పసిగట్టే ఇండక్షన్ టెస్టర్‌ను సిబ్బంది దగ్గర ఉంచుకోవాలన్నారు. దీంతో విద్యుత్ ప్రవాహం తెలుసుకొని ప్రమాదాలు అరికట్టవచ్చన్నారు. పనుల్లో భద్రతా నియమాలు విధిగా పాటించాలన్నారు. పగటిపూట వీధిలైట్లు వెలగకుండా తగు చర్యలు తీసుకొని విద్యుత్ వృథాను అరికట్టాలన్నారు. వినియోగదారులతో వాట్సఅప్ గ్రూపులను ఏర్పాటు చేసి వారి విద్యుత్ సమస్యలను పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో లోఓల్టేజీ సమస్య రాకుండా కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నారు. రైతుల విద్యుత్ సరఫరా లైన్లలో తలెత్తే సమస్యలను గుర్తించి పరిష్కరించాలన్నారు. విధుల పట్ల అలసత్వం వహించే ఉద్యోగులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో డీఈ శివయ్య, జేఈ మోసీన్, సిబ్బంది పాల్గొన్నారు.

దేశాలు దాటిన ప్రేమ

ప్రొద్దుటూరు అబ్బాయికి, పోలాండ్ అమ్మాయికి వివాహం



వివాహం చేసుకున్న అక్షర, శ్రీహర్ష

ప్రొద్దుటూరు : ప్రేమకు కులమతాలతోపాటు దేశ సరిహద్దులు కూడా అడ్డు రావని వారు నిరూపించారు. ప్రొద్దుటూరుకు చెందిన అరకటవేముల లక్ష్మీనారాయణ, సుశీల కుమారుడు శ్రీహర్ష.. పోలాండ్ దేశానికి చెందిన జన్ పౌలుస్, బొగ్గుమిళ వ్రోబెల్ కుమార్తె అక్షరను సంప్రదాయబద్ధంగా గురువారం వివాహం చేసుకున్నారు. ప్రొద్దుటూరులోని రాయల్ కౌంటి రిసార్ట్స్‌లో ఈ వివాహం జరిగింది. పెద్ద సంఖ్యలో బంధు మిత్రులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. శ్రీహర్ష ఎంఎస్ చదివేందుకు స్వీడన్ వెళ్లాడు. పోలాండ్‌కు చెందిన అర్చన అదే కళాశాలలో చదువుతుండేది. చదువు పూర్తి చేసుకున్న ఇరువురు అక్కడే సాఫ్ట్‌వేర్ జాబ్ చేస్తున్నారు. కళాశాలలో చదువుకున్న రోజుల నుంచి ప్రేమించుకున్న వీరు కుటుంబ పెద్దల అంగీకారంతో వివాహం చేసుకున్నారు. పోలాండ్ దేశానికి చెందిన పలువురు వివాహానికి హాజరయ్యారు.

కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం



మృతి చెందిన నీలకంఠారెడ్డి

సింహాద్రిపురం : కారు ఢీకొన్న ప్రమాదంలో గురువారం ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కసనూరు గ్రామానికి చెందిన నీలకంఠారెడ్డి(55) పశువుల గడ్డి కోసం బైక్‌పై అంకాలమ్మ గూడూరు – అగ్రహారం గ్రామాల మధ్యలో ఉన్న పీబీసీ కాలువ సమీపంలో వెళ్తున్నాడు. అతన్ని సింహాద్రిపురం నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నీలకంఠారెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం చుట్టుపక్కల గ్రామాలకు తెలియడంతో భారీ సంఖ్యలో జనాలు ఘటనా స్థలానికి చేరుకున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగులోని నాగలకట్ట వీధికి చెందిన దూదేకుల మనోహర్ (41) గురువారం రాత్రి రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారిలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్‌ఐ బి.రామకృష్ణ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నాగలకట్ట వీధికి చెందిన దూదేకుల మనోహర్ భార్య మాబున్నీ.. భర్తను వదలి వెళ్లడంతో మానసికంగా కుంగిపోయి వీధుల వెంట తిరిగే వాడు. చిత్తు కాగితలు ఏరుకుంటూ వచ్చిన డబ్బులతో మద్యానికి బానిసై తాగేవాడు. గురువారం రాత్రి రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారిలో బైపాస్ సమీపంలో చనిపోయి ఉన్నాడు. కాగా ఇతని శరీరంపై ఎటువంటి గాయాలు లేవు. మనోహర్ సంబంధీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడికి గాయాలు



గాయపడ్డ అన్వర్‌బాషా

కలకడ : రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని కె.దొడ్డిపల్లె పంచాయతీ గోపాలపురం వద్ద జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని దిగువపాళ్యం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు అన్వర్‌బాషా తన ద్విచక్రవాహనంలో గురువారం ఉదయం కలకడ నుంచి పాఠశాలకు బయలుదేరాడు. మార్గంమధ్యలో గోపాలపురం వద్ద బైక్‌ను గుర్రంకొండ రోడ్డు నుంచి కలకడ వైపు వస్తున్న బొలెరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడ్డ అన్వర్‌బాషాను స్థానికులు 108 అంబులెన్స్ వాహనంలో చికిత్స నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కలకడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరదాయిని.. జగజ్జనని



పూజలు నిర్వహిస్తున్న మఠాధిపతి శ్రీవీరశివకుమారస్వామి



గీతా పారాయణం ఆలపిస్తున్న చిన్మయామిషన్ వారు

- కనుల పండువగా అమ్మవారి ఆరాధనోత్సవాలు
- మార్మోగిన ఈశ్వరీదేవి నామస్మరణ

బ్రహ్మంగారిమఠం : 'వర ప్రదాయిని.. జగజ్జనని' అంటూ భక్తులు శరణు వేడారు. 'కొలిచే వారి కొంగు బంగారమై నిలిచే తల్లీ.. మమ్మల్ని చల్లంగా చూడు' అంటూ భక్తి శ్రద్ధలతో ప్రార్థించారు. ఈశ్వరీదేవి మఠం జగన్మాత నామస్మరణతో మార్మోగింది. బ్రహ్మంగారి మఠంలోని శ్రీఈశ్వరీదేవి మఠంలో అమ్మవారి ఆరాధన గురుపూజ మహోత్సవాలు కనుల పండువగా నిర్వహిస్తున్నారు. ఐదో రోజైన గురువారం పూర్వపు మఠాధిపతి వీరబ్రహ్మయ్యాచార్య సాముల వారి ఆరాధన నిర్వహించారు. ఉదయం ప్రభాత సేవ, అభిషేకం, బిల్వదళార్చన, గురుపూజ విధులు చేపట్టారు. మఠాధిపతి శ్రీవీరశివకుమారస్వామి, రాజేశ్వరిదేవి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ద్వార పూజ, నైవేద్యం, మంత్ర పుష్పం, నీరాజనం, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు చేపట్టారు. రాత్రి గ్రామోత్సవం ఉత్సాహ భరితంగా జరిగింది. బ్రహ్మంగారిమఠానికి చెందిన శ్రీచిన్మయామిషన్ వారి గీతాపారాయణం భక్తులను అలరించింది. కళాకారులు చేపట్టిన భజన కార్యక్రమం ఆకట్టుకుంది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ బీవీ జగన్‌మోహన్‌రెడ్డి, సీవీ సుబ్బారెడ్డి, బి.నారాయణస్వామి, సి.రామిరెడ్డి, ఎమ్.పద్మజ తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కళకళ

బ్రహ్మంగారిమఠంలోని ప్రముఖ దర్శనీయ స్థలాలు భక్తులతో కళకళలాడుతున్నాయి. అమ్మవారి ఆరాధనోత్సవాలకు వచ్చిన వారు పరిసర ప్రాంతాల్లోని ఆలయాలను దర్శించుకుంటున్నారు. శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి మఠం, స్వామి నివాస గృహం, పోలేరమ్మ చేత నిప్పు తెప్పించిన రచ్చబండ, పోలేరమ్మ గుడి, కక్కయ్య మఠం, బ్రహ్మంసాగర్ ప్రాజెక్టు, ఈశ్వరీదేవి తపస్సు చేసిన గుహ, సిద్ధయ్య మఠం, అక్కంపేటలోని నాగలింగేశ్వరస్వామి ఆలయం(విభూది లింగం), మద్దాయత్రి విశ్వకర్మ వంశవృక్ష దేవాలయం, రామాలయం (భజన మందిరం) తదితర ప్రాంతాలను సందర్శించారు.